# ఇదా నాగరికత?

శ్రీధర్ చెప్పేది వింటూనే స్థాణువులా నిలబడిపోయింది శ్రీలక్ష్మి. తన జీవితసౌధం కళ్ళముందే కుప్పకూలి పోతోంది. తాను వింటోంది నిజమా అబద్ధమా అన్నట్లు అతనివైపు కళావిహీనంగా చూస్తుండి పోయింది.

"నువ్వే నా జీవితం లక్ష్మీ! నిన్ను చూడకుండా ఒక్క నిమిషం ఉండలేను. నీతో మాట్లాడకుండా అసలు ఉండలేను. నువ్వు నాకు కావాలి. పద ఇప్పుడే గుళ్ళో పెళ్ళి చేసుకుందాం. మనకి ఎవరి ఒప్పు దలా అవసరంలేదు" శ్రీధర్ శ్రీలక్ష్మి చెయ్యి పట్టుకుని పదమన్నాడు పదిహేనేళ్ళ కిందట.

"అంత తొందరేమిటి...." అంటూ ఏదో అనబోయిన శ్రీలక్ష్మి మాటలు మధ్యలో ఆపేసి "తొందరా? లక్ష్మీ! తొందరకాదు. నాకు టైమ్ చాలా విలువైంది. ప్రతిక్షణం లెక్కించతగ్గదే. నీతో గడిపే ప్రతి నిమిషం అపురూపమైందే.... అప్పటికి వెధవ ట్రాన్స్ఫర్, చికాకులు....అది నిన్ను వెంట పెట్టుకు తీసుకువెళ్ళగల ఊరు ందు గనక బెంపంత పెట్టలేదు. ఇప్పుడా సమస్యలు లేవుగనుక పద...." అం టూనే ఇరువైపులా ఉన్న అసమ్మతిని లక్ష్యం చెయ్యకుండా అనుకున్న ఆ క్షణమే గుళ్ళో దైవసమక్షంలో తనదాన్నిచేసుకున్న శ్రీధర్ కళ్ళల్లో కురిసిన ప్రేమవర్షం, ఆ అనుభూతి.... ఇవన్నీ గడిచిపోయి 15 వసం

తాలు గడిచినా ఇంకా మనసులో పచ్చగా.... అప్పటి ఆనాటి శ్రీధర్ ఏమైనాడు? ఆనాటి ప్రేమ.... ఏమైంది?

"లక్ష్మీ!" కదలకుండా నిలబడిపోయిన శ్రీలక్ష్మి భుజంపట్టి కుదిపాడు శ్రీధర్.

వర్తమానంలోకి ఉలిక్కిపడి చూసింది శ్రీలక్ష్మి.

"నేను చెప్పేది విన్నావా లక్ష్మీ?"

"నాకేం అర్థంకావడంలేదు శ్రీధర్! అంతా అయోమయంగా ఉంది. అంతా పీడకలలాగా ఉంది...."

"ఎందుకంత అప్సెట్ అవుతావు? ఇందులో కొంపమునిగేదేం ఉంది? నిన్నెట్లా పెళ్ళి చేసుకున్నానో, రేఖనుకూడా అలాగే ఇష్టపడ్డాను. చేసుకున్నాను. అయినా దీనివల్ల నీకేం ఇబ్బంది కలగదు. రేఖకోసం వేరే ఇల్లు అద్దెకు తీసుకున్నాను. నేను అప్పుడప్పుడూ నీ దగ్గరకు వస్తుంటాను...." చాలా మామూలుగా, ప్రశాంతంగా అన్నాడు శ్రీధర్.

"ఛీ!" ఒక్కసారిగా అంది శ్రీలక్ష్మి. "అప్పుడప్పుడు నా దగ్గరకు వస్తావా? ఇంకో ఆడదాన్ని ముట్టుకుని, నన్ను ముట్టుకుంటా ననడానికి సిగ్గులేదూ!"

శ్రీధర్ కళ్లు ఆ ఛీత్కారానికి కోపంతో ఎరుపెక్కినై. "ఒళ్లు

దగ్గర పెట్టుకుని మాట్లాడు. నా ఇష్టం వచ్చినట్లు నేను ప్రవర్తిస్తాను. అడగడానికి నువ్వెవరు?...."

"నేనెవర్ని అనే దశకు వచ్చావా? నువ్వు తాళికట్టిన నీ పెళ్ళాన్ని...."

"పెళ్లానివే కానీ, మన పెళ్ళికి ముందు నువ్వేమన్నా పతివ్రతవా?.... తీవ్రంగా అన్నాడు శ్రీధర్. చెంపమీద చెళ్లున కొట్టినయిట్లంది శ్రీలక్ష్మికి.

"నాతో పరిచయం కాకముందు నువ్వు ఆ శ్రీనివాస్‌గాడి పక్కలోను, దినకర్‌గాడి పక్కలోను ఎన్నిసార్లు పడుకోలేదు. పైగా వాళ్ళు వివాహితులుకూడా. అడ్డమైన వాళ్ళతో నీకు శారీరక సంబంధం ఉందని తెలిసికూడా నిన్ను పెళ్ళి చేసుకుని నీ పక్కలో పడుకోలేదా?.... అప్పుడు నువ్వనుకున్నావా.... జీవితాంతం ముడిపడబోయే వాళ్ళకి అన్యాయం చేస్తున్నానని.... అది న్యాయమే కానీ, ఇది అన్యాయమా...?"

"అది, అప్పుడేదో జరిగింది.." అన్నప్పుడామె గొంతులో తడబాటు, "అయినా మన పెళ్లి జరిగాక మనసా, వాచా కర్మణా నిన్నే నమ్ముకున్నాను కదా..." నాలుక తడారిపోతుంటే మాటలు కూడదీసుకుంది.

"చూడు లక్ష్మీ! వాదన అనవసరం. నువ్వెంత మొత్తుకున్నా

రేఖతో నేను తెగతెంపులు చేసుకోలేను. రేఖ నాకు కావాలి..?" ఖచ్చి తంగా అన్నాడు శ్రీధర్.

"నాకోసం కాకపోయినా పిల్లల కోసమైనా ఇంకోసారి ఆలోచించండి. మన సంఘంలో తండ్రి స్టేటస్ సరిగా లేకపోతే అది పిల్లల భవిష్యత్తు మీద దెబ్బతీస్తుంది. అందులో ఎదిగిన ఆడపిల్ల ఉంది మనింట్లో..."

"వాళ్ళ విషయం నేను ఆలోచిస్తాలే... ఆ పిల్లల తండ్రిగా నాకు బాధ్యత ఉంది నేవెళ్ళొస్తా. రేఖ ఎదురు చూస్తుంటుంది..." శ్రీలక్ష్మి కింక మాట్లాడే అవకాశం ఇవ్వలేదు శ్రీధర్. అతను వెళ్ళిపోతున్నవైపు చూస్తుండిపోయింది నిస్తేజంగా.

ఆమె ఎంత ప్రయత్నించినా మనస్సును సరిపెట్టుకోలేకపోతోంది. హృదయాన్ని ఒక శిలగా మార్చుకోలేకపోతున్నది. ఏమిటి ఈ పరిణామం... పెచ్చుమీరిన నాగరికతకు ఇదొక నిదర్శనమా? లోకమంతా అధఃపాతాళానికి కుంగిపోతున్నట్లుందామెకు.

కాదు. ఇది తనకు తగిలిన శాపం... అవును శాపమే... కన్నీటి చారికల మధ్య గతం వెతుక్కుంటున్నది లక్ష్మి. ఆ గతంలో..

"లక్ష్మీ! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. నువ్వంటే నాకు అమితమైన ఇష్టం. నువ్వెంత అందంగా ఉన్నావో నీకు తెలియదు. ఎర్రటి నీ పెదవులు చూస్తుంటే నాకు పిచ్చెక్కిపోతోంది..." ఆమె అబు

వణుకూ దినకర్ రాగాలు మీటుతున్నాడు. ఆమె అతని చేతిలో పువ్వులా నలిగిపోతోంది. అతను వికసిస్తున్న ఆమె యవ్వనాన్ని దినకర్ రోజు రోజూ కొల్లగొట్టుకున్నాడు. అతనిచ్చే ఆ సుఖం శరీరం పదే పదే కోరుకునేది.

అతనికి పెళ్ళైందనీ, అతని భార్య ఊరికి వెళ్ళిందనీ తెలుసు శ్రీలక్ష్మికి. ఆమె ఎదురుగా ఎలా ఉంటాడో కానీ శ్రీలక్ష్మి ఎదుట ఆమెను గురించి తక్కువగా మాట్లాడి శ్రీలక్ష్మిని ఉబ్బెయ్యడం అతని అభిమతం. "దానికి అందం చందం లేదు. రసికత తెలీదు. దాన్ని వదిలి నిన్ను చేసుకుంటాను" అందిన అందాన్ని వదిలే తెలివితక్కువవాడు కాదు దినకర్.

ఇలా ట్యూషన్ వంకన శృంగార కేళిలో తేలిపోతున్న లక్ష్మి ఒక రోజు హఠాత్తుగా అతని కౌగిలినుంచి విడివడింది, పిడుగుల్లా పడ్తున్న తిట్ల ధాటికి.

"ఏమే! నా సంసారమే దొరికిందా నాశనం చెయ్యడానికి. పెళ్ళి కానివాళ్లు చాలామంది ఉన్నారు. అలాంటివాళ్ళ పక్కలోపడి పొర్లు కావాలంటే...."

ఒక్కక్షణం అవాక్కైంది లక్ష్మి. అయినా తేరుకుని "మేమిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం...." అనడమేమిటి ఒక్కఊపులో జుట్టు పట్టి లాగి "నా సంసారంలోకి అడుగుపెట్టిన నువ్వు సర్వనాశనమైపోతావే...." అంటూ ఇంకా అనరాని మాటలు చాలా అన్నది.

ఐతే, చిత్రమేమిటంటే దినకర్ మాత్రం నోరెత్తలేదు. "పోనీ గీతా! పోనీ, పోనీ...." అంటున్నాడు. నూతిలోంచి వచ్చినట్లుంది అతని గొంతు. దినకర్ తనను సపోర్టు చేస్తాడనీ, భార్యను అవతలికి తోసి తనను కౌగిట్లోకి తీసుకుంటాడనీ ఆశించిన శ్రీలక్ష్మికి షాక్ తగిలినట్లయింది. "మళ్ళీ ఇక్కడెక్కడైనా కనిపిస్తే పాతి పెడతాను...." అంటూ ఒక్కతోపు తోసిందామె.

ముద్దాయిలా నిలబడ్డ దినకర్ వంక ఓసారి చూసి ఏదో అనబోయి విరమించుకుని బయటపడింది. అంతే, ఇక దినకర్ ఏనాడూ తనకు కనిపించలేదు. అక్కడి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. చాలారోజులు దినకర్ కౌగిలి, ఆ సుఖం కోసం పిచ్చెక్కిపోతున్నప్పుడు శ్రీధర్‌తో పరచయమైంది. అమాయకత్వమో, తెలియనితనమో దినకర్‌తో తన అనుభవం, పరిచయం.... అతని భార్య తిట్లు అన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది. ఆమె మంచితనానికీ, నిర్మలత్వానికీ సంబరపడి, మరింత ఎక్కువ ప్రేమించాడు శ్రీధర్.

అయితే శ్రీలక్ష్మి, శ్రీధర్‌ల పెళ్ళికి సంవత్సరం ముందు శ్రీధర్ దూరాన్ని శ్రీలక్ష్మి భరించలేకపోయింది. ఆమె అతని సాన్నిధ్యానికీ, పొందుకు అలమటిస్తున్న సమయంలో తమ ఇంటి పక్కగదిలోకి కొత్తగా పెళ్ళయిన భార్యాభర్తలిద్దరు వచ్చారు. అతని పేరు శ్రీనివాస్. చదివే నవలలు, చూస్తున్న సినిమాలు ఒళ్ళు వేడెక్కిస్తుంటే ఆమె అతని మీద వ్యామోహం పెంచుకుంది. ఆడది కౌగిట్లోకి వస్తే కాదనే మగవాడెవడు?

సైగలు, గుసగుసలు, ఊరవతల కలుసుకోవడం నిరాఘాటంగా

సాగింది. తన శరీరాన్ని శ్రీలక్ష్మి శ్రీనివాస్‌కి కూడా పరిచయం చేసింది. అయితే దొంగచాటు వ్యవహారం ఎంతకాలం సాగుతుంది. ఎంతకాలం దాగుతుంది. అనుమానం వచ్చిన శ్రీనివాస్ భార్య ఇద్దర్నీ నిలదీసింది. అయితే ఈమె దినకర్ భార్యలాగా తనను వెళ్ళగొట్టి శ్రీనివాస్‌ని తీసుకు పోలేదు.

"ఛీ! నీలాంటి నీచుడితో సంసారం చెయ్యాల్సిన అగత్యం నాకు లేదు. ఇద్దరూ కలిసి కట్టకట్టుకుని గంగలో దిగండి...." అని తిట్టి వెళ్ళిపోయింది శ్రీనివాస్ చాలా కంగారు పడిపోయినాడు. కాని తరవాత తెలిసిందేమిటంటే ఆమె శ్రీనివాస్‌తో కాపురం చెయ్యడానికి ఒప్పుకోలేదుట. ఊరు విడిచి వెళ్ళిపోయింది.

ఈలోపల శ్రీధర్ వచ్చి తమ పెళ్ళికి తొందరపెట్టి చేసుకోవడం జరిగింది. కానీ శ్రీనివాస్ సంసారం పాడుకావడానికి కారణం తనే. అయినా ఇన్ని జరిగినా శ్రీధర్ శ్రీలక్ష్మిని మనసారా ప్రేమించాడనడానికి, అతని చెక్కుచెదరని ప్రేమకు నిదర్శనం అతను గాలి కబుర్లు కాకుండా తనదాన్ని చేసుకోవడమేగాక... ఇన్నేళ్ళూ సాఫీగా సంసారం సాగించడం.

ఈ సంసారయాత్రలో ఒక ఆడపిల్లకీ, ఒకమగపిల్లాడికి తాము తల్లితండ్రుల పాత్ర వహించారు. ఇది నిన్నటి వరకు కథ...

మరి ఇప్పుడు జరిగిన ఈ సంఘటనను తానెట్లా స్వీకరించాలి? నిజంగా ఆనాడు దినకర్ భార్య, శ్రీనివాస్ భార్య... ఇద్దరూ, ఈనాడు తాను పడుతున్న క్షోభ అనుభవించి ఉంటారు. కానీ తనెంత తేలిగ్గా తీసు

కుంది. మరిప్పుడు తానేం చెయ్యాలి. ఈ వ్యవస్థలో ఒంటరిగా... ఈ మధ్య ఇటువంటి కథలు, కేసులు ఎక్కువయినై. చాలామంది మగ వాళ్ళు భార్య ఉండగానే వేరే ఆడవాళ్ళతో శారీరకంగా కలపడం పెళ్లి చేసుకుని కాపురం పెట్టడం... చాలా జరుగుతున్నై. దీనికికారణం ఎవరు? మగవాడా, ఆడదా? ఆ రేఖకు తెలియదా శ్రీధర్‌కి పెళ్ళైందని... కసిగా అనుకుంది. కానీ గతం మెదలగానే ఆ దెబ్బ తిరిగి తీవ్రంగా తనకే తగిలింది. అంటే తప్పు ఆడదానిదేనా? అంటే తనదీ, తనలాంటి మనస్తత్వమున్నవాళ్ళదీ!

ఆడవాళ్ళందరూ అట్లాగే ఉన్నారా? మగవాళ్ళది కూడా ఉంది దోషం. అనేక రకాల ఆకర్షణల్లో పడి జనం కొట్టుకుపోతున్నారు. ఈ సమాజం ఎటో దారి తప్పుతోంది. అంతా అరణ్యంలా ఉంది. ఈ అరణ్యం దాటితే నందనవనమేదైనా ఉందా? అసలీ ఆకర్షణ' వ్యామోహం, అన్యాయం, పరాయి ఆడదానికోసం మగవాడి ఆరాటం పరాయి మగవాడికోసం ఆడదాని వెంపర్లాట... ఇట్లాంటి దట్టమైన అరణ్యం నుంచి బయటపడి, నీతివంతమైన, ప్రశాంతమైన, స్వచ్ఛమైన కొత్తలోకంలోకి కొత్తబాట ఏర్పడుతుందా? ఏమో... శ్రీలక్ష్మి మనస్సు అస్తవ్యస్తంగా, దిగులుగా, భవిష్యత్తు అంధకారంగా ఉంది. శ్రీధర్ కౌగిట్లో రేఖను ఊహించుకుంటుంటే భరించరాని ఆవేదనతో తల పట్టుకుని మంచంమీద వాలిపోయింది శ్రీలక్ష్మి.

(స్రవంతి వినూత్న వారపత్రిక 26-5-1988)